



మ్యానిఫెస్టో విడుదల చేస్తున్న డీఎంకే నేతలు

బడిపిల్లలకు అల్పాహారం

- రూ.500లకు గ్యాస్ సిలిండర్
- రూ.75కు లీటర్ పెట్రోలు
- గృహిణులకు ప్రతినెలా రూ.1000
- చెన్నైలో సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్
- డీఎంకే మేనిఫెస్టోలో వరాలు

చెన్నై, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి అధికార పక్షమైన డీఎంకే బుధవారం ఉదయం ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. డీఎంకే మహిళా విభాగం నాయకురాలు కనిమొళి నాయకత్వంలో ఏర్పాటైన ప్రత్యేక కమిటీ మేనిఫెస్టోను రూపొందించింది. అరివాలయంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో మేనిఫెస్టోను పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ చేత ఆవిష్కరించారు. పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాలు, దేశవ్యాప్తంగా ఇండియా కూటమి అభ్యర్థులు గెలిచి కేంద్రంలో అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలు అంటూ ఈ మేనిఫెస్టోలో పేర్కొన్నారు.

ముఖ్యమైన హామీలివే..

1.దేశవ్యాప్తంగా రైతుల రుణాలు వడ్డీ సహా మాఫీ. 2.అన్ని రాష్ట్రాల్లో గృహిణులకు ప్రతినెలా రూ.1000 3. అన్ని రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులతో రాష్ట్రాల అభివృద్ధి కమిటీ 4. కేంద్రంలో మళ్లీ ప్రణాళికా సంఘం ఏర్పాటు. రాష్ట్ర ప్రభుత్వాల విజ్ఞప్తులను ఆమోదించే రీతిలో పథకాల రూపకల్పన ప్రస్తుత నీతి ఆయోగ్ రద్దు 5. రాష్ట్రంలో నీట్ రద్దు 6. జాతీయ రహదారుల్లో టోల్‌గేట్ల రద్దు 7. పరిశ్రమలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సిమెంట్ రహదారుల నిర్మాణం 8. ఇక రాష్ట్ర ప్రభుత్వాలకే విశ్వవిద్యాలయాలకు వైస్‌ఛాన్సలర్లను ఎంపిక చేసే అధికారం 9. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ -2010) రద్దు 10. కాలేజీ విద్యార్థులకు 1 జీబీ సామర్థ్యంతో కూడిన ఉచిత సిమ్‌కార్డుల పంపిణీ 11. రాష్ట్రాలలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుపుతున్న ఉన్నత విద్యా సంస్థల్లో స్థానికులకు 50 శాతం రిజర్వేషన్లు 12. గవర్నర్ వ్యవస్థ రద్దుకు కృషి. 13. బ్యాంకు ఖాతాల్లో మినిమం బ్యాలెన్స్ లేకుంటే విధించే పెనాల్టీ రద్దు 14. కేంద్ర ప్రణాళికా సంఘం లాగే శాశ్వత ప్రాతిపదికన కేంద్ర నిధుల కమిటీ ఏర్పాటు 15. వసూలు చేస్తున్న అదనపు పన్ను, వాటి ఖర్చులను పారదర్శకంగా జరపడం. 16. నిఘా సంస్థల్లో నియామకాలు జరిపేందుకు 50 శాతం రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు 17. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సముద్రతీర ప్రాంతాల్లో నిర్లవణీకరణ ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రజలకు పరిశుభ్రమైన నీటి సరఫరా 18.దేశంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో స్మార్ట్ సిటీ పథకాల అమలు 19. దేశంలోని పవిత్ర స్థలాల్లో భక్తులకు అన్ని రకాల సదుపాయాల కల్పన 20. రాబర్ట్ కాల్‌వెల్ పరిశోధన కేంద్రం ఏర్పాటు 21. రిటైర్ అయిన న్యాయమూర్తులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు రెండు సంవత్సరాల తర్వాతే ప్రైవేటు సంస్థల్లో పనిచేయడానికి వెళ్లేలా చట్ట సవరణ 22. శ్రీలంక తమిళులకు భారత పౌరసత్వం 23. కచ్చాదీవికి విముక్తి 24. జమ్ము, కశ్మీర్‌కు రాష్ట్రస్థాయి హోదా 25. పుదుచ్చేరికి రాష్ట్రస్థాయి హోదా 26. జమిలి ఎన్నికలకు స్వస్తి 27. యూపీఎస్సీ ఎంపిక కమిటీలో అన్ని రాష్ట్రాల ప్రతినిధుల సభ్యత్వం 28. మళ్లీ రాష్ట్రాల పరిధిలోకి విద్య, ఆరోగ్యం 29. పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేసిన ప్రజా వ్యతిరేక చట్టాలన్నీ రద్దు 30. రాష్ట్రంలోని విద్యా సంస్థలపై కేంద్రం బలవంతంగా రుద్దే పరీక్షల రద్దు 31. నూతన విద్యావిధానం బుట్టదాఖలు 32. పార్లమెంటు, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు 33. చెన్నైలో సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ 34. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో తమిళభాషకు ప్రాధాన్యం 35. దేశవ్యాప్తంగా బడిపిల్లలందరికీ ఉదయం పూట అల్పాహారం 36. దేశవ్యాప్తంగా విద్యారుణాల మాఫీ 37. రూ.500కు గ్యాస్ సిలిండర్, రూ.75కు లీటర్ పెట్రోలు రూ.65కు లీటర్ డీజిల్ 38. చెన్నైలో మూడో రైల్వే టెర్మినల్ ఏర్పాటు.

గవర్నర్, మోదీ మా ప్రచార సారథులు

- ముఖ్యమంత్రి స్టాలిన్ ఎద్దేవా
- కేంద్రంలో అధికారం తమ కూటమిదేనని ధీమా



పెరంబూర్, మార్చి 20: తమ పార్టీకి గవర్నర్‌తో పాటు ప్రధాని మోదీ కూడా ప్రచార సారథిగా మారారని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ఎద్దేవా చేశారు. బుధవారం లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి డీఎంకే మేనిఫెస్టోను విడుదల చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ద్రావిడ మోడల్ పాలనలో అన్నివర్గాలు అభివృద్ధి చెందాలన్నదే తమ లక్ష్యమన్నారు. 'చెప్పిందే చేస్తాం... చేసేదే చెప్తాం' అనే కలైంజర్ కరుణానిధి ఆశయ బాటలో తమ ప్రభుత్వ పయనిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ మేనిఫెస్టో ప్రజలు తయారుచేసిందిగా ఉండాలని భావించామన్నారు. అందుకోసం పార్టీ సంయుక్త ప్రధాన కార్యదర్శి కనిమొళి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో పర్యటించి వ్యాపారులు, రైతులు, కార్మికులు, పారిశ్రామికవేత్తలు, మహిళా సంఘాలు, నిరుద్యోగులు, విద్యార్థులు, అసంఘటిత కార్మికులను కలుసుకొని వారు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి అభిప్రాయాలు సేకరించి పార్టీకి అందజేసిందన్నారు. ప్రస్తుతం తాము విడుదల చేస్తున్నది డీఎంకే మేనిఫెస్టో కాదని, ప్రజా మేనిఫెస్టో అని అన్నారు. గత పదేళ్లలో బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం దేశాన్ని చిన్నాభిన్నం చేసిందన్నారు. రాజ్యాంగ వ్యవస్థను మోదీ కాలరాసి ఫాసిస్ట్ పాలన సాగించారన్నారు. ఎన్డీఏ నేతృత్వంలో బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలు వివక్షకు గురయ్యాయని విమర్శించారు. ఇలాంటి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేలా 'ఇండియా' కూటమి ఏర్పాటైందన్నారు. రాష్ట్రాల హక్కులను కాపాడడం, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, రక్షణకు ఈ కూటమి పాటుపడుతుందన్నారు. ప్రజలు కూడా బీజేపీ పదేళ్ల పాలనతో విసిగిపోయి మార్పు కోరుకుంటున్నారని స్టాలిన్ చెప్పారు. ఇక రాష్ట్రంలో బీజేపీ బహిరంగ సభలు చూసి డీఎంకేకు జ్వరం పట్టుకున్నదని మోదీ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. భయం అనే జ్వరం కారణంగా రాష్ట్రానికి తరచూ ఆయన పర్యటిస్తున్నారని విమర్శించారు. తుఫాను, వరదల సమయంలో ప్రధాని పర్యటించి ఉంటే రాష్ట్ర ప్రజలు ఆహ్వానించే వారని, ప్రస్తుతం కేవలం ఎన్నికల కోసమే రెండు నెలల్లో నాలుగు సార్లు రాష్ట్రంలో మోదీ పర్యటించారన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో డీఎంకే పాలనను విమర్శిస్తూ పార్టీకి ప్రచారకర్త గవర్నర్ రవి వ్యవహరిస్తున్నారని, ప్రస్తుతం ఆయనకు ప్రధాని మోదీ జతకలిశాడని, ఆ ప్రకారం డీఎంకేకు గవర్నర్, ప్రధాని ప్రచార సారథులుగా ఉన్నారని సీఎం వ్యంగోక్తులు విసిరారు.

బీజేపీ దూకుడు... అన్నాడీఎంకే దిగాలు

- ఈపీఎస్ ఎదుట పెను సవాళ్లు



చెన్నై, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే ఎన్నిక ఏదైనా నిర్ణయాలు తీసుకోవడంలో అన్నాడీఎంకే ముందంజలో ఉండేది. ఏయే పార్టీలతో పొత్తులు పెట్టుకోవాలి? మిత్రపక్షాలకు ఎన్ని సీట్లు కేటాయించాలి? ఏయే నియోజకవర్గాలు ఇవ్వాలి? అనే విషయాలపై అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్, ఆయన రాజకీయ వారసురాలు జయలలిత రాకెట్ వేగంతో నిర్ణయాలు తీసుకుని ప్రకటించేవారు. ఎన్నికల్లో జయ మరీ దూకుడుగా వ్యవహరించేవారు. వేగంగా పార్టీలతో పొత్తుపెట్టుకునేవారు, అంతేవేగంతో ఏ పార్టీతోనూ పొత్తులు పెట్టుకోకుండా ఒంటరి పోరుకు సిద్ధమయ్యేవారు. అప్పట్లో అన్నాడీఎంకేతో పొత్తుపెట్టుకోవడానికి వివిధ రాజకీయ పార్టీలు రాయపేట కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశాయనడంలో అతిశయోక్తి లేదు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే జయ అన్ని పనులు ముగించుకుని అన్ని పార్టీలకంటే ముందుగా ప్రచారానికి బయలుదేరి వెళ్లేవారు. ఓసారి అభ్యర్థుల జాబితాను విలేకరుల సమావేశంలో వెల్లడించే సంప్రదాయానికి స్వస్తి పలికి ఆ చిట్టాను తన పార్టీ కార్యాలయ గోడకు అతికించి ప్రచారానికి వెళ్లిన సంగతిని ఎవరూ మరచిపోలేరు. అయితే జయ మృతి తర్వాత ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన ఎడప్పాడి పళనిస్వామి కూడా గత మూడేళ్లుగా జయలాగే వేగంగా నిర్ణయాలు తీసుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో చక్కటి వ్యూహరచన చేసి బీజేపీతో పొత్తుపెట్టుకుని పోటీ చేసి పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా కల్పించారు. అదే సమయంలో అన్నాడీఎంకేతో పొత్తుపెట్టుకోవడంతో బీజేపీ నాలుగు అసెంబ్లీ స్థానాల్లోనూ గెలిచింది. ఆ తర్వాత పార్టీ పగ్గాలను చేపట్టడంలో చాకచక్యంగా వ్యవహరించారు. పార్టీలో ఏక నాయకత్వం అవసరమన్నారు. తానే పార్టీ ప్రధాన కార్యదర్శినంటూ సమన్వయకర్తగా వ్యవహరించిన పన్నీర్‌సెల్వంను దూరంగా పెట్టారు. పార్టీ వ్యవహారాల్లోనూ, న్యాయపోరాటాల్లోనూ విజయం సాధించి తిరుగులేని నాయకుడిగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా పార్టీపై ఆధిపత్యం సంపాదించుకోగలిగారు.

అదంతా ఒక వైపు అయితే...

ఇంతటి అనుభవాన్ని సంపాదించిన ఈపీఎస్ ఈ లోక్‌సభ ఎన్నికల సమయంలో వేగవంతమైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం పట్ల ఆ పార్టీ నేతలే దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ కూటమి నుంచి వైదొలగే సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న ఈపీఎస్ లోక్‌సభ ఎన్నికల్లో వన్నియార్ల ఓటు బ్యాంక్ కలిగిన పీఎంకేతో పొత్తును కుదుర్చుకోవడంలో జాప్యం చేశారని చెబుతున్నారు. సీట్ల కేటాయింపు ఎలా ఉన్నా పీఎంకే పొత్తును కొనసాగిస్తుందని ఈపీఎస్ అతిగా విశ్వసించారు. రెండు సార్లు పీఎంకే నేత ఇంటివద్దే సీనియర్ నేతలతో పొత్తుపై చర్చలు జరిపించారు. ఆ చర్చల సమయంలో పీఎంకే నేతలు బీజేపీపై మొగ్గు చూపరనే నమ్మకం కూడా ఈపీఎస్‌కు కలిగింది. అదే సమయంలో బీజేపీ సుడిగాలిలా పీఎంకేని చుట్టుముట్టేసింది. రాత్రిపూట రహస్య మంతనాలు జరిపి, ఎక్కువ సీట్లిస్తామని హామీ ఇచ్చి, అవసరమయితే అన్బుమణికి మంత్రి పదవిని కూడా ఇచ్చేందుకు సిద్ధమేనని, సేలంలో జరిగే ప్రధాని మోదీ పాల్గొనే సభలో పీఎంకే నేతలకు అగ్రతాంబూలం ఇస్తామని అన్నామలై, కేంద్ర మంత్రి మురుగన్ భరోసా ఇవ్వడంతో పీఎంకే నేతలు రాందాస్, అన్బుమణి బీజేపీ కూటమిలో క్షణాల్లో చేరిపోయారు. అప్పటిదాకా ఈ ఎన్నికల్లో డీఎంకే కూటమికి ధీటుగా మెగా కూటమితో బరిలోకి దిగుతామని చెబుతూ వచ్చిన ఈపీఎస్‌కు పీఎంకే నేతల ఆకస్మిక నిర్ణయం దిగ్భ్రాంతిని కలిగించింది. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే మరుసటి రోజు సేలం సభలో పీఎంకే నేతలు ప్రధాని మోదీకి ఇరువైపులా ఆశీనులయ్యారు. ఈ హఠాత్పరిణామాలు ఈపీఎస్‌ని బాగా కుదిపేశాయి. అప్పటికే చిన్నా చితకా పార్టీలతో పొత్తును ఖరారు చేసుకున్న ఈపీఎస్ చివరకు డీఎండీకేని కూటమిలో చేర్చటంలో సఫలీకృతులయ్యారు. ఏ పార్టీతో పొత్తుకుదుర్చుకోవాలో ఈనెల 21న గురువారం చెబుతానన్న డీఎండీకే నాయకురాలు ప్రేమలతతో చర్చలు జరిపి పార్టీ కార్యాలయానికి పిలిపించి మరీ ఒక రోజు ముందే ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ ఎన్నికల్లో డీఎంకే మెగా కూటమి, అన్నాడీఎంకే మెగా కూటమి తలపడాల్సి ఉండగా, బీజేపీ సృష్టించిన రాజకీయ తుఫానులో ఆ పరిస్థితులు తలకిందులయ్యాయి. ఈ సారి డీఎంకే మెగా కూటమితో బీజేపీ మెగాకూటమి తలపడే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం చిన్నా చితక పార్టీలతో ఈపీఎస్ లోక్‌సభ ఎన్నికల బరిలో దిగుతున్నారు. మారిన రాజకీయ పరిస్థితులలో డీఎంకేకు ధీటైన పోటీ అన్నాడీఎంకే కూటమా? బీజేపీ కూటమా? అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఈ ప్రశ్నకు లోక్‌సభ ఎన్నికల ఫలితాలే సమాధానం చెబుతాయి.

ఏఎంఎంకేకు రెండు స్థానాలు

- బీజేపీ కూటమి బలపడాలన్నదే మా లక్ష్యం
- టీటీవీ దినకరన్

ప్యారీస్, మార్చి 20: బీజేపీ కూటమి బలపడాలన్న లక్ష్యంతోనే రెండు స్థానాలతో తృప్తిపడ్డామని అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ అన్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమితో చేతులు కలిపిన ఏఎంఎంకేకు రెండు పార్లమెంటు స్థానాలు కేటాయించారు. టినగర్‌లో ఉన్న బీజేపీ ప్రధాన కార్యాలయంలో కమలాలయంలో బుధవారం అన్నామలై, టీటీవీ దినకరన్ మధ్య పొత్తుపై ఒప్పందం కుదుర్చుకొని సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంకా కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, ఎల్.మురుగన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దినకరన్ మీడియాతో మాట్లాడుతూ... ఏఎంఎంకే ఒక స్థానిక పార్టీ అని, తమ పార్టీ నిర్వాహకులందరూ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇష్టపడుతున్నారన్నారు. అయినా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా తమకంటూ గుర్తింపు రావాలన్న ఉద్దేశంతోనే ఎన్డీఏ కూటమిలో చేరామని, తమకు రెండు స్థానాలు కేటాయించడం సంతృప్తికరంగా ఉందన్నారు. రైతుల మద్దతు తమకు అధికంగా ఉన్న డెల్టా జిల్లాల్లో ఆ రెండు స్థానాలు కేటాయించే అవకాశముందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న 15 లోక్‌సభ నియోజకవర్గాల్లో తమ పార్టీతో దోస్తీ కట్టే వారికే విజయావకాశాలు మెండుగా ఉంటాయని, ఇందుకు ఉదాహరణం 2019 ఎన్నికల్లో పొందిన ఓట్లేనని గుర్తు చేశారు. కాగా, పారివేందర్ నేతృత్వంలో ఇండియా మక్కల్ కల్వి మున్నేట్ర కళగంకు బీజేపీ కూటమిలో ఒక సీటు కేటాయించారు. ఓపీఎస్‌తో పొత్తుపై గురువారం ప్రకటించే అవకాశముంది.



ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న అన్నామలై, దినకరన్



ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న ఈపీఎస్, ప్రేమలత

అన్నాడీఎంకేతో డీఎండీకే దోస్తీ

- కూటమిలో ఐదు సీట్ల కేటాయింపు

ప్యారీస్, మార్చి 20: లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే కూటమిలో డీఎండీకేకు బెర్త్ ఖరారైంది. నెల రోజులుగా ఈ రెండు పార్టీల మధ్య సాగిన సీట్ల సర్దుబాటు సమస్య ఎట్టకేలకు బుధవారం కొలిక్కివచ్చింది. దీంతో, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత, ఎల్కే సుధీష్, డాక్టర్ ఇళంగో తదితర నేతలు రాయపేటలో ఉన్న అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయమైన ఎంజీఆర్ మాళిగైకు చేరుకోగా వారిని అన్నాడీఎంకే సీనియర్ నేత కేపీ మునుస్వామి పుష్పగుచ్ఛం సమర్పించి ఆహ్వానించారు. అనంతరం కార్యాలయంలోని సమావేశ మందిరంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, ప్రేమలత మధ్య సీట్ల పంపకంపై కాసేపు చర్చించిన అనంతరం డీఎండీకేకు ఐదు లోక్‌సభ స్థానాలు కేటాయించినట్లు ఈపీఎస్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ముందుగా ప్రేమలత మీడియాతో మాట్లాడుతూ... దివంగత ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత సినీరంగంలోనే కాకుండా రాష్ట్ర రాజకీయాల్లో కూడా చక్రం తిప్పి, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, వారిలాగే డీఎండీకే వ్యవస్థాపకులు దివంగత విజయకాంత్ కూడా రాణించారని, ఆ ముగ్గుర్నీ దైవంగా భావిస్తున్నట్లు ఆమె తెలిపారు. 2011 ఎన్నికల్లో అన్నాడీఎంకే రికార్డు స్థాయిలో సాధించిన విజయం మళ్లీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో పునరావృత్తం కానుందని, 2026 అసెంబ్లీ ఎన్నికల వరకు అన్నాడీఎంకేతో తమ పొత్తు అలాగే కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రజలు ఎవరి వల్ల అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందో స్పష్టంగా గమనిస్తున్నారని, ఈ ఎన్నికల్లో తమ కూటమినే ఆశీర్వదించి గెలిపిస్తారని చెప్పారు. అనంతరం పళనిస్వామి మాట్లాడుతూ... 2019 లోక్‌సభ ఎన్నికలు, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను డీఎంకే సక్రమంగా నెరవేర్చకుండా కుంటిసాకులు చెబుతూ కాలం వెళ్లబుచ్చుతోందని విమర్శించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే-కాంగ్రెస్ కూటమి తరపున పోటీ చేసి గెలిచిన ఎంపీలంతా రాష్ట్రానికి నీట్ మినహాయింపుపై పార్లమెంటులో చర్చించకుండా మౌనంగా గడిపారన్నారు. త్వరలో తమ పార్టీ తరఫున మేనిఫెస్టో విడుదల చేస్తామని ఈపీఎస్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎస్పీ వేలుమణి, మాధవరం మూర్తి, తంగమణి, డాక్టర్ విజయభాస్కర్, కడంబూర్ రాజు, పి.వలర్మతి, గోకుల ఇందిర, మాజీ ఎంపీలు టీజీ వెంకటేష్‌బాబు, డాక్టర్ జె.జయవర్ధన్ సహా పలువురు నేతలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అన్నాడీఎంకే కూటమిలో చేరిన డీఎండీకేకు తిరువళ్లూర్ (రిజర్వుడు), సెంట్రల్ చెన్నై, కడలూరు, విరుదునగర్, తంజావూరు పార్లమెంట్ నియోజకవర్గాలు కేటాయించారు.



అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేస్తున్న అన్నాడీఎంకే నేతలు

మా పొత్తు ప్రజలతోనే

- ఈపీఎస్ ప్రకటన
- అభ్యర్థుల తొలి జాబితా

చెన్నై, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలతోనే పొత్తుపెట్టుకుని బరిలోకి దిగుతున్నామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి అన్నారు. రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో బుధవారం ఉదయం 16 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... అన్నాడీఎంకే కూటమిలో డీఎండీకే, ఎస్డీపీఐ, పురట్చిభారతం, మనిద నేయ మక్కల్ కట్చి, ఉళవర్ ఉళప్పాళర్ కట్చి, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్‌లు మిత్రపక్షాలుగా ఉన్నాయని తెలిపారు. ఎస్డీపీఐకి దిండుగల్ నియోజకవర్గాన్ని, పుదియ తమిళగం పార్టీకి తెన్‌కాశిని కేటాయించినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో అన్నాడీఎంకే సభ్యుల ద్వారా రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన పీఎంకే నేత డాక్టర్ అన్బుమణి రాందాస్ బీజేపీతో పొత్తుపెట్టుకోవడం వల్ల ఈ ఎన్నికల్లో తమ పార్టీకి ఎలాంటి నష్టం లేదన్నారు. అన్నాడీఎంకే స్వయంప్రతిపత్తి కలిగిన పార్టీ అనీ, ఏ పార్టీతోనూ పొత్తుపెట్టుకోదని చెప్పారు. కూటమిలోకి ఏ పార్టీని బలవంతపెట్టి చేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. 2014లో పార్టీలతో పొత్తు పెట్టుకోకుండా అన్నాడీఎంకే ఘనవిజయం సాధించిందని గుర్తు చేశారు. తమ పార్టీలో 2 కోట్లా ఆరులక్షల మంది సభ్యులు ఉన్నారని, ఈ ఎన్నికల్లో వారంతా అభ్యర్థుల గెలుపుకోసం పాటుపడనున్నారని చెప్పారు. డీఎంకే పాలనలో కొత్త పథకాలేవీ లేవని నీట్‌ను రద్దు చేసి తీరుతామని ప్రకటించి ప్రజలను మాయమాటలతో మోసగించి 39 సీట్లలో గెలిచిందని, ఆ తర్వాత నీట్‌ను రద్దు చేయలేక పోయిందని విమర్శించారు. ఈ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమి ఘనవిజయం సాధిస్తుందని ఈపీఎస్ ధీమా వ్యక్తం చేశారు. మలి జాబితా ఒకట్రెండు రోజుల్లో విడుదల చేస్తామని ఈపీఎస్ చెప్పారు.

అన్నాడీఎంకే అభ్యర్థుల తొలి జాబితా...

నార్త్ చెన్నై - రాయపురం ఆర్ మనో, సౌత్ చెన్నై- డాక్టర్ జె.జయవర్ధన్, కాంచీపురం - ఇ.రాజశేఖర్, అరక్కోణం - ఏఎల్ విజయన్, కృష్ణగిరి- వి. జయప్రకాష్, ఆరణి- జీవీ గజేంద్రన్, విల్లుపురం - జె. భాగ్యరాజ్, సేలం - పి. విఘ్నేష్, నామక్కల్ - ఎస్ తమిళ్‌మణి, ఈరోడ్ - ఆట్రల్ అశోక్‌కుమార్, కరూరు - కేఆర్ఎల్ తంగవేల్, చిదంబరం - ఎం. చంద్రశేఖరన్, నాగపట్టినం - డాక్టర్ జి.సుర్‌చిత్ శంకర్, మదురై - డాక్టర్ పి.శరవణన్, తేని- డాక్టర్ వీటీ నారాయణసామి, రామనాథపురం - పి.జయపెరుమాళ్.

రంజాన్ వేళలు

గురువారం : ఇఫ్తార్ : సాయంత్రం - 6.26

శుక్రవారం : సహర్ : ఉదయం - 4.31



సమాచార ద్వని

టెక్నీషియన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, మార్చి 20: టెక్నీషియన్ పోస్టులకు అర్హులైన వారు ఏప్రిల్ 8వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చని భారత రైల్వే తెలిపింది. టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ విభాగంలో 1,100, టెక్నీషియన్ గ్రేడ్-3 విభాగంలో 7.900 పోస్టులు భర్తీకానున్నాయి. గ్రేడ్-3 పోస్టులకు 38 ఏళ్లలోపుండి టెన్త్ ఉత్తీర్ణతతో పాటు ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లొమా చేసిన వారు, గ్రేడ్-1 పోస్టులకు బీఎస్సీ, బీఈ, బీటెక్ చేసిన 36 ఏళ్లలోపున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష ఫీజుగా జనరల్, ఓబీసీలు రూ.500, ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికులు, దివ్యాంగులు, మహిళలు రూ.250 ఆన్‌లైన్‌లో చెల్లించాలి. వివరాలకు www.indianrailways.gov.in, www.rrbchenai.gov.inలో చూడవచ్చు.

వేసవి సెలవులకు ప్రత్యేక రైళ్లు

ఐసిఎఫ్, మార్చి 20: వేసవి సెలవులను పురస్కరించుకొని 30 ప్రత్యేక రైళ్లను 150 సర్వీసులుగా నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. ఏప్రిల్, మే నెలల్లో సొంతూళ్లకు, పర్యాటక స్థలాలకు ప్రజలు ఎక్కువగా వెళ్తుంటారు. వారి సౌకర్యార్థం తాంబరం - తిరునల్వేలి, సెంగోట్టై, చెన్నై ఎగ్మూర్ నుంచి నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, వేలాంకన్ని, చెన్నై సెంట్రల్ - కోవై, తిరువనంతపురం, బెంగళూరు సహా వివిధ మార్గాల్లో 30 ప్రత్యేక రైళ్లను 150 సర్వీసులుగా నడుపుతామని తెలిపారు. ఈ రైళ్ల టైంటేబుల్ త్వరలో విడుదల చేస్తామని తెలిపారు.

మాదకద్రవ్యాల స్మగ్లింగ్ నిరోధానికి యాప్

ఐసిఎఫ్, మార్చి 20: మాదకద్రవ్యాల స్మగ్లింగ్ నిరోధకానికి కొత్త యాప్ రూపకల్పన జరుగుతోంది. రాష్ట్రంలో మత్తుపదార్థాల తరలింపు, విక్రయం, వినియోగం పెరిగాయి. ఒకే నెలలో 402 మందిని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. స్మగ్లింగ్ అడ్డుకొనేలా కొత్త యాప్ అందుబాటులోకి రానుంది.

కామాక్షిపురి ఆధీనం పీఠాధిపతి పదవీ స్వీకారం

ఐసిఎఫ్, మార్చి 20: కోయంబత్తూర్ జిల్లా కామాక్షిపురి ఆధీనం ముక్తి చెందిన నేపథ్యంలో, రెండో పీఠాధిపతిగా పంచలింగేశ్వర స్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 12వ తేది శివలింగేశ్వర స్వామి తన 55వ ఏట ముక్తిచెందారు. ఆ స్థానంలో పంచలింగేశ్వర స్వామి బాధ్యతలు స్వీకరించారు.

రూ.4 కోట్లతో ప్రయోగశాల

ఐసిఎఫ్, మార్చి 20: కొబ్బరి ఉత్పత్తుల నాణ్యత పరీక్ష కోసం రూ.4 కోట్లతో ప్రయోగశాల నిర్మాణ ఎనులను రాష్ట్రప్రభుత్వ రోప్ బిజినెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రారంభించింది. కోయంబత్తూర్ కాళపట్టి సిడ్కో ఎస్టేట్‌లో 3,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తులతో ఏర్పాటుకానున్న ప్రయోగశాలలో అత్యాధునిక పరికరాలు అమర్చనున్నారు. దీని ద్వారా తాళ్ల తయారీ సంస్థలు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వస్తువులు తయారుచేకోవచ్చని అధికారులు తెలిపారు.

2.25 లక్షల మంది విద్యార్థుల చేరిక

ఐసిఎఫ్, మార్చి 20: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక 2.25 లక్షలకు చేరుకుంది. 2024-25 విద్యా సంవత్సరంలో విద్యార్థుల అడ్మిషన్లు ఈనెల 1వ తేది నుంచి ప్రారంభమైన విషయం విదితమే. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 4 లక్షలకు పైగా విద్యార్థుల సంఖ్య ఉండాలని పాఠశాల విద్యాశాఖ లక్ష్యంగా నిర్దేశించింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటూ ఉచితంగా పాఠ్య, నోటు బుక్స్, ఉదయం అల్పాహారం అందిస్తుండడంతో పాటూ స్మార్ట్ తరగతులు ఏర్పాటు చేస్తుండడంతో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు వస్తున్నారు. దీంతో అడ్మిషన్లు ప్రారంభమైన 19 రోజుల్లో 2.25 లక్షల మంది విద్యార్థులు చేరారు.

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, మార్చి 20: తిరువణ్ణామలై ఆలయ పౌర్ణమి గిరి ప్రదక్షిణ సందర్భంగా ప్రత్యేక రైళ్లు నడపుతున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

- నెం.06033 చెన్నై బీచ్ - వేలూరు కంటోన్మెంట్ - తిరువణ్ణామలై ప్రత్యేక మెమో రైలు ఈ నెల 24న రాత్రి 7 గంటలకు చెన్నై బీచ్‌లో బయల్దేరి అర్ధరాత్రి 12.05 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. అలాగే, నెం.06034 తిరువణ్ణామలై - వేలూరు కంటోన్మెంట్ - చెన్నై బీచ్ మెమో ప్రత్యేక రైలు తిరువణ్ణామలైలో ఈ నెల 25వ తేది తెల్లవారుజామున 3.45 గంటలకు బయల్దేరి ఉదయం 9.05 గంటలకు చెన్నై బీచ్ చేరుకుంటుందని దక్షిణ రైల్వే తెలిపింది.

నేడు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి వర్షాలు

అడయార్, మార్చి 20: రాష్ట్రవ్యాప్తంగా నేడు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నై ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నెల 24నుంచి 26వ తేదీ వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్‌ల్లో పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొంది. చెన్నై సహా పరిసర ప్రాంతాల్లో రానున్న 48 గంటలపాటు ఆకాశం కొంతమేరకు మేఘావృతమై ఉంటుందని వెల్లడించింది. గురువారం రాష్ట్రంలోని కోస్తాతీర జిల్లాల సహా వాటికి అనుకుని వున్న జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

చిత్తూరులో గుండెపోటుతో రాష్ట్రవాసి మృతి



చిత్తూరు, మార్చి 20: గుండెపోటుతో రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి బుధవారం మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు... తమిళనాడులోని షోళింగర్‌కు చెందిన ఓ వ్యకి చిత్తూరుకు వచ్చాడు. ఓ మెడికల్ షాపులో మందుల కోసం వెళ్లి తిరిగి వస్తుండగా ఫిట్స్ వచ్చాయి. దాంతో ఆయన ఉన్నఫళంగా కిందపడిపోయాడు. 108కు సమాచారం వెళ్లడంతో సిబ్బంది వచ్చి పరీక్షించేలోపే ఆయన మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



లోక్‌సభ ఎన్నికల్లో 85 ఏళ్ల పైబడిన వృద్ధులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకొనేలా సలవన్‌పేట తిరుపూర్ కుమరన్ వీధిలోని వృద్ధుడికి ఫారం-12డి అందిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

ఎమ్మెల్యేలు, ఎంపీలు విరాళాలివ్వండి

- టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై



సత్యమూర్తి భవన్‌లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేల సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై

చెన్నై, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం, డీఎంకే మిత్రపక్షాల అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయడం కోసం ఎమ్మెల్యేలు, ఎంపీలు భారీగా విరాళాలివ్వాలని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై విజ్ఞప్తి చేశారు. సత్యమూర్తి భవన్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేల సమావేశం జరిగింది. ఆ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేలు రూ.15లక్షలు, ఎంపీలు రూ.25లక్షలు చొప్పున విరాళాలివ్వాలని కోరారు. ఈ నిర్ణయాన్ని పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

మణిశంకర్ అయ్యర్ సందడి...

ఇదిలా ఉండగా సత్యమూర్తి భవన్ వద్ద మాజీ ఎంపీ మణిశంకర్ అయ్యర్ సందడి చేశారు. కాంగ్రెస్ తరపున పోటీ చేసే ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ గడువు బుధవారం ముగియనున్న సమయంలో ఆయన సత్యమూర్తి భవన్‌కు వెళ్లారు. ఎప్పుడూ పార్టీ ఆఫీసుకు రాని మణిశంకర్ అయ్యర్ కనిపించగానే పార్టీ నేతలు ఆయనకు నమస్కరించారు. అదే సమయంలో కొందరు నాయకులు డీఎంకే కూటమిలో కాంగ్రెస్‌కు మైలాడుదురై నియోజకవర్గం లభించిందని, ఆ నియోజకవర్గంలో పోటీకి దరఖాస్తు చేశారా అని ప్రశ్నించారు. వెంటనే ఆయన తన అనుచరులను పిలిచి తన తరపున దరఖాస్తులు సమర్పించలేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అనుచరులు సత్యమూర్తి భవన్‌లోపలకు పరుగుతో వెళ్ళి ఆయన తరఫున దరఖాస్తు సమర్పించారు. గడువు ముగిసే సమయంలో తన దరఖాస్తు సమర్పించినట్లు తెలుసుకున్న మణిశంకర్ అయ్యర్ నవ్వుకుంటూ అక్కడి నుండి వెళ్ళిపోయారు.

వేలూరులో నామినేషన్ దాఖలు ప్రారంభం



కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నటుడు మన్సూర్ అలీఖాన్ - ఏసీ షణ్ముగం

వేలూరు, మార్చి 20: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నామినేషన్ దాఖలు ప్రారంభమైంది. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 19వ తేది జరగనున్న విషయం తెలిసిందే. వేలూరు లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ దాఖలు బుధవారం ప్రారంభం కాగా, గుడియాత్తానికి చెందిన మునియప్పన్, సినీనటుడు మన్సూర్ అలీ ఖాన్ స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుబ్బులక్ష్మి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మన్సూర్ అలీఖాన్ విలేకరులతో మాట్లాడుతూ... 'ఎదిర్ నీచ్చల్...' అనే పాట పాడి నామినేషన్ దాఖలు చేశానన్నారు. ఇండియా జననాయగ పులిగళ్ తరపున పోటీ చేస్తున్న తాను పనస పండు, క్రికెట్ బ్యాట్, లారీ తదితర గుర్తులు కేటాయించాలని ఎన్నికల అధికారిని కోరినట్లు ఆయన తెలిపారు.

వేలూరు స్థానంలో ఏసీ షణ్ముగం పోటీ

బీజేపీ కూటమిలో వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో పుదియ నీది పార్టీ తరపున ఏసీ షణ్ముగం పోటీ చేయనున్నారు. పలు వైద్య కళాశాల నిర్వాహకుడిగా ఉన్న షణ్ముగం, వేలూరు, రాణిపేట, తిరుపత్తూర్ జిల్లాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రజల అండతో తన విజయం సాధిస్తానని షణ్ముగం ధీమా వ్యక్తం చేశారు.

ఆమ్నీ బస్సుల్లో తనిఖీలు

ఐసిఎఫ్, మార్చి 20: ఎన్నికల నేపథ్యంలో అక్రమ నగదు, వస్తువులు తరలించడాన్ని అడ్డుకొనేలా ఆమ్నీ బస్సుల్లో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు ప్రారంభించారు. లోక్‌సభ ఎన్నికల నిబంధనలు అమల్లోకి రావడంతో తగిన ఆధారాలు లేకుండా నగదు, వస్తువులు తరలించే వారిపై ఈసీ చర్యలు చేపడుతోంది. ఆ ప్రకారం రాష్ట్రంలో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆమ్నీ బస్సుల్లో ప్రయాణికులు లగేజీలు, పార్శిళ్ల వంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘించే బార్ల లైసెన్స్ రద్దు

ఐసిఎఫ్, మార్చి 20: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే బార్ల లైసెన్స్ రద్దు చేస్తామని టాస్మాక్ సంస్థ హెచ్చరించింది. రాష్ట్రంలో 4,820 మద్యం దుకాణాల్లో బ్రాందీ, బీరు, విస్కీ రకాలు విక్రయిస్తున్నారు. 2,500లకు పైగా బార్లు పనిచేస్తున్నాయి. ప్రస్తుతం ఎన్నికల నిబంధనలు అమల్లోకి రావడంతో మద్యం విక్రయాలపై ఈసీ దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో, బార్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం అనుమతించిన సమయంలోనే మద్యం విక్రయాలు చేపట్టాలని, అధిక మద్యం విక్రయించే దుకాణాలపై చర్యలు చేపడతామని, నిబంధనలు ఉల్లంఘించి బార్లు పనిచేస్తే లైసెన్స్ రద్దు చేస్తామని టాస్మాక్ సంస్థ హెచ్చరించింది.

నీలగిరిలో కార్చిచ్చు

ఐసిఎఫ్, మార్చి 20: కార్చిచ్చు ఏర్పడడంతో నీలగిరి జిల్లాలో 30 ఎకరాల విస్తీర్ణంలో అటవీ ప్రాంతం దగ్ధమైనట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ జిల్లాలోని కున్నూరు వెల్లింగ్టన్ సమీపంలో ఈనెల 12వ తేది కార్చిచ్చు ఏర్పడింది. వైమానికదళ సహాయంతో మంటలు ఆర్పుతున్నారు. ఈ నేపథ్యంలో,మంగళవారం ఒకే రోజున 10 జిల్లాల్లోని 73 ప్రాంతాల్లో కార్చిచ్చు ఏర్పడిందని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

ఆర్ఎల్‌డీఏతో డీఆర్ఏ హోమ్స్ ఒప్పందం

అడయార్, మార్చి 20: నగరంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ డీఆర్ఏ హోమ్స్ కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఎగ్మోర్‌లో రైల్వే ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఆర్ఎల్‌డీఏ)కు చెందిన 1.06 ఎకరాల స్థలాన్ని 99 యేళ్లకు లీజుకు తీసుకుని, ఆ స్థలాన్ని కమర్షియల్‌గా అభివృద్ధి చేసేలా ఈ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం గురించి డీఆర్ఏ హోమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ రంజీత్ రాథోడ్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 'ఆర్ఎల్‌డీఏ మద్దతుతో వాణిజ్య అభివృద్ధిలోకి అడుగుపెట్టడం చాలా సంతోషంగా ఉంది. ఆర్ఎల్‌డీఏతో మా సహకారం తమ కంపెనీ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. పట్టణ ప్రకృతి దృశ్యాన్ని పునర్నిర్వచించే అసాధారణమైన కార్యాలయ స్థలాలను అందిస్తాము. ఈ ప్రాజెక్టులో భాగంగా అత్యున్నత స్థాయి కార్యాలయ భవనాలను నిర్మించడమే కాకుండా, వాణిజ్య వ్యాపారంగా అనుకూలమైన వాతావరణం ఉండేలా దృష్టి సారిస్తాం' అని అన్నారు.

ఆస్తి తగాదా : తండ్రిని చంపిన కుమారుడు


ప్యారీస్, మార్చి 20: స్థానిక కొళత్తూర్ రాజమంగళంలో ఆస్తి తగాదాలో ఓ కుమారుడు తండ్రిని దారుణంగా హతమార్చాడు. పోలీసుల కథనం మేరకు... రాజమంగళం బాబానగర్‌కు చెందిన మధుసూదనన్(64), శారద దంపతుల నాల్గో కుమారుడు జార్జిబుష్ తనతండ్రి పేరుతో ఉన్న ఆస్తులను తన పేరున రాసివ్వాలని గొడవపడే వాడు. మంగళవారం సాయంత్రం పూటుగా తాగి వచ్చిన జార్జిబుష్.. మత్తులో ఇనుప రాడ్‌తో తండ్రిపై దాడికి పాల్పడడంతో ఆయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించారు. దీనిపై అందిన సమాచారంతో పోలీసులు మధుసూదనన్ మృతదేహాన్ని స్టాన్లీఆసుపత్రికి తరలించారు.జార్జిబుష్‌ను అరెస్ట్ చేసి బుధవారం ఉదయం కోర్టులో హాజరుపరచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు.

కాశిమేడులో మత్తుమందుల అమ్మకం

- రౌడీ భార్య సహా ఆరుగురి అరెస్టు

చెన్నై, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాశిమేడు ప్రాంతంలో ఓ ఇంటిలో మత్తుమందులు విక్రయించిన రౌడీ భార్య సహా ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. కాశిమేడు జీఎంపేటలోని ఓ ఇంటిలో పోలీసులు ఆకస్మిక తనిఖీ జరిపినప్పుడు ఇంటి నిండా మత్తు మాత్రలు లభించాయి. ఈ సంఘటనకు సంబంధించి ప్రస్తుతం పుళల్ జైలులో ఉన్న రౌడీ ఢిల్‌కుమార్ భార్య మసికా, ఆమె బంధువులు ప్రదీప్, అజయ్, భరత్‌కుమార్, సామ్‌సంగ్, ప్రకాష్ అనే ఆరుగురిని అరెస్టు చేశారు. ఇదే విధంగా కుండ్రత్తూరు తురపాక్కంలో బైక్ ట్యాక్సీ నడుపుతూ రాత్రి పూట కస్టమర్లకు గంజాయి విక్రయిస్తున్న ఒట్టేరికి చెందిన వినోద్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

హత్యకేసులో యావజ్జీవ శిక్ష



నిందితుడు సెల్వంతో పోలీసులు

వేలూరు, మార్చి 20: హత్యకేసులో లారీ డ్రైవర్‌కు న్యాయస్థానం యావజ్జీవ జైలుశిక్ష విధించింది. కాట్పాడి సమీపం కిలిత్తాన్‌పట్టరై అయగాపురి నగర్‌కు చెందిన రామన్, అదే ప్రాంతానికి సెల్వం లారీ డ్రైవర్లుగా జీవనం సాగిస్తుండేవారు. 2022 ఏప్రిల్ 18వ తేది ఇద్దరూ మద్యం తాగుతుండగా ఘర్షణ చెలరేగి సెల్వం దాడిలో రామన్ మృతిచెందాడు. ఈ కేసు విచారణ వేలూరు జేఎం-1 కోర్టులో జరుగుతుండగా, నిందితుడుకు సెల్వంకు యావజ్జీవశిక్ష విధిస్తూ బుధవారం న్యాయమూర్తి శాంతి తీర్పు వెలువరించారు.


జాన్ పాండ్యన్ పార్టీకి ఒక సీటు

అడయార్, మార్చి 20: బీజేపీ కూటమి పార్టీలకు సీట్ల కేటాయింపు జోరుగా సాగుతోంది. ఇందులోభాగంగా జాన్‌పాండ్యన్ సారథ్యంలోని తమిళగ మక్కల్ మున్నేట్ర కళగంకు ఒక స్థానం కేటాయించింది. ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై, జాన్‌పాండ్యన్ బుధవారం సంతకాలు చేశారు. అయితే, ఏ స్థానంలో పోటీ చేస్తుందనే విషయంపై స్పష్టత రాలేదు. కానీ, జాన్ పాండ్యన్ నేతలు మాత్రం తెన్‌కాశి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్టు వెల్లడించారు.

మొదటి రోజు నాలుగు నామినేషన్లు

పెరంబూర్, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల్లో తొలివిడత నామినేషన్ల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. చెన్నై జిల్లా పరిధిలో మూడు లోక్‌సభ నియోజకవర్గాలుండగా, నామినేషన్లు ప్రారంభమైన తొలిరోజు ఉత్తర చెన్నై లోక్‌సభ స్థానానికి పి.మారిముత్తు స్వతంత్ర అభ్యర్థిగా, అజిత్‌కుమార్ తాక్కం పార్టీ అభ్యర్థిగా నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే, సెంట్రల్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గంలో సెల్వకుమార్ తాక్కం పార్టీ అభ్యర్థిగా, డాక్టర్ ఆర్.కార్తికేయన్ నామ్ తమిళర్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్లు దాఖలు చేశారు. కాగా, దక్షిణ చెన్నై లోక్‌సభ నియోజకవర్గంలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎన్నికల అధికారి జె.రాధాకృష్ణన్ తెలిపారు.

ఈడీ అధికారి అంకిత్ తివారీకి బెయిలు



చెన్నై, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లంచం కేసులో అరెస్టయిన మదురై ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారి అంకిత్ తివారికి సుప్రీంకోర్టు బుధవారం ఉదయం షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. దిండుగల్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రి డాక్టర్ సురేష్‌బాబు వద్ద రూ.20లక్షల లంచం తీసుకుంటుండగా రాష్ట్ర అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ) అధికారులు అరెస్టు చేశారు. డిసెంబర్ 1న అరెస్టయిన అంకిత్ తివారి మదురై సెంట్రల్ జైలులో ఉన్నారు. దిగువ కోర్టు, హైకోర్టు డివిజన్ బెంచ్‌లలో ఆయన బెయిలు కోసం పెట్టుకున్న పిటిషన్లన్నీ తోసివేతకు గురయ్యాయి. ఏసీబీ అధికారులు, పోలీసులకు తెలపకుండా తమిళనాడును విడిచి పెట్టి వెళ్లకూడదని, సాక్ష్యాధారాలను చెరిపివేయకుండా విచారణకు అన్ని విధాలా సహకరించాలనే షరతులతో సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేసింది.

చెన్నైలో హావర్త్ రెండో మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్



మీడియా సమావేశంలో నిర్వాహకులు

అడయార్, మార్చి 20: అంతర్జాతీయ గ్లోబల్ వర్క్‌స్పేస్ సొల్యూషన్స్ కంపెనీల్లో ఒకటైన హావర్త్ తన రెండో మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను చెన్నైలో ప్రారంభించింది. భారత్‌తో పాటు ఆసియా పసిఫిక్ రీజియన్‌లో తమ మార్కెట్ కార్యకలాపాల విస్తరణలో భాగంగా 8 నుంచి 10 మిలియన్ డాలర్ల పెట్టుబడితోట 1,13,000 చదరపుటడుగుల విస్తీర్ణంలో ప్లాంట్ ఏర్పాటు చేసింది. ఈ కొత్త ఫ్యాక్టరీ దిగుమతులు తగ్గించడం, ఎగుమతి పెంచడం, డెలివరీ షెడ్యూల్‌ను ఆప్టిమైజ్ చేయడంలో కీలక భూమిక పోషిస్తుందని ఆ కంపెనీ సీఈవో, ప్రెసిడెంట్ ఫ్రాంకో బైంచి చెప్పారు. గత యేడాది ప్రపంచ విక్రయాల్లో 2.57 బిలియన్ డాలర్ల వృద్ధిని సాధించిందని, ఇది తమ కంపెనీ మూడు శాతం వృద్ధిని చూపుతోందన్నారు. బ్యాంకింగ్, ఐటీ, తయారీ రంగం, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్, ఎడ్యుకేషనల్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌తో పాటు మెట్రోపాలిటన్ స్పేస్‌ల కోసం ఎర్గోనామిక్ ఫర్నిచర్ అందిస్తామని సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు హెన్నింగ్ ఫిగ్జ్ చెప్పారు.

దక్షిణ భారత మార్కెట్‌లోకి ఫ్యూజన్ సీఎక్స్



అడయార్, మార్చి 20: బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బీపీఎం), కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ (సీఎక్స్) సొల్యూషన్స్‌లో గ్లోబల్ లీడర్‌గా ఉన్న ఫ్యూజన్ సీఎక్స్ బుధవారం చెన్నైలో తొలి కార్యాలయాన్ని ప్రారంభించింది. తద్వారా దక్షిణ భారత మార్కెట్‌లో అడుగుపెట్టేందుకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రాంతంలో సర్వీస్ డెలివరీని మెరుగుపరిచేందుకు వీలుగా ఈ కార్యాలయం ఉపయోగపడుతుందని పేర్కొంది. ఈ కార్యాలయాన్ని మొత్తం 350 సీట్ల సౌకర్యంతో 12 వేల చదరపుటడుగుల విస్తీర్ణంలో ప్రారంభించగా, ఇక్కడ రెండు షిఫ్టులలో 650 మంది ఉద్యోగులు పని చేస్తారని ఆ కంపెనీ కో-ఫౌండర్, డైరెక్టర్ కిషోర్ సరోగి బుధవారం నగరంలో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

వడపళనిలో కావేరి హాస్పిటల్ ప్రారంభం



కావేరి హాస్పిటల్ భవనసముదాయాన్ని ప్రారంభిస్తున్న రజనీకాంత్

చెన్నై, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని ఆర్కాట్ రోడ్డులో ఏవీఎం స్టూడియో సమీపంలో కొత్తగా నిర్మించిన కావేరి హాస్పిటల్ భవన సముదాయాన్ని బుధవారం ఉదయం సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన ప్రసంగిస్తూ... పదిహేనేళ్లుగా ప్రైవేటు సంస్థల ప్రారంభోత్సవాలకు దూరంగా ఉంటున్న తాను కావేరి ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్న మాజీ రోగిగా ఆ ఆసుపత్రి వైద్యులందరికీ కృతజ్ఞతలు తెలిపే రీతిలో ఈ కార్యక్రమానికి విచ్చేశానని చెప్పారు. తన సినీ కెరీర్‌లో పలు మలుపులకు కారణమైన ఏవీఎం స్టూడియో చేరువగా ఏర్పాటైన ఈ ఆసుపత్రి ఉన్నత స్థాయికి చేరుకోవడం ఖాయమన్నారు. నగరం అంతర్జాతీయ స్థాయిలో మెడికల్ హబ్‌గా మారిందని, వైద్య రంగంలో పరిశోధనలే కీలక పాత్ర వహిస్తాయని, ఆ దిశగా వైద్యులు చికిత్సా విధానాల్లో జరుగుతున్న విప్లవాత్మక మార్పులను గమనించాలన్నారు. ఇక మందుల్లో కల్తీకి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారికి యావజ్జీవ కారాగార శిక్ష విధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కావేరి ఆసుపత్రుల గ్రూపు వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్. చంద్రకుమార్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.మణివణ్ణన్ సెల్వరాజ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్, ప్రముఖ తమిళ సినీ దర్శకుడు ఎస్పీ ముత్తురామన్, డాక్టర్ చొక్కలింగం తదితరులు పాల్గొన్నారు.

23న ఎన్టీకే అభ్యర్థుల పరిచయం

ఐసిఎఫ్, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల్లో నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే) తమిళనాడు, పుదుచ్చేరిలో ఉన్న 40 నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీ చేయనుంది. పార్టీ అభ్యర్థుల పరిచయ సమావేశం చెన్నైలో జరగనుంది. స్థానిక పల్లావరం - దురైపాక్కం రోడ్డులో కావేరి ఆసుపత్రి ఎదుట ఈనెల 23వ తేది సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న సమావేశంలో ఒకే వేదికపై 40 మంది అభ్యర్థులను పార్టీ సమన్వయకర్త సీమాన్ పరిచయం చేయనున్నారని పార్టీ కార్యాలయం పేర్కొంది.

నేడు కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా విడుదల


- సెల్వపెరుందగై

ప్యారీస్, మార్చి 20: డీఎంకే కూటమిలో పార్టీకి కేటాయించిన 10 పార్లమెంటు స్థానాల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల జాబితా గురువారం రాత్రిలోపు విడుదల చేస్తామని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సెల్వపెరుందగై పేర్కొన్నారు. రాయపేటలోని పార్టీ కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో రెండు రోజులుగా 9 పార్లమెంటు నియోజకవర్గాలు, విలవంగోడు అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేయదలచిన ఆశావాహుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను రాష్ట్ర ఎన్నికల కమిటీ నిర్వాహకులతో కలసి సెల్వపెరుందగై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఒక్కో నియోజకవర్గానికి ముగ్గురేసి అభ్యర్థులతో తయారు చేసిన జాబితాను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. తుది అభ్యర్థుల జాబితా గురువారం రాత్రిలోపు అధిష్ఠానం ప్రకటిస్తుందన్నారు. బెంగుళూరు బాంబు పేలుడు ఘటనలో తమిళులకు సంబంధాలున్నాయంటూ కేంద్రమంత్రి శోభ వ్యాఖ్యానించడాన్ని ఖండిస్తున్నామని సెల్వపెరుందగై అన్నారు.

కేంద్ర మహిళా మంత్రిపై డీఎంకే ఫిర్యాదు

ప్యారీస్, మార్చి 20: కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో జరిగిన బాంబు పేలుళ్లలో తమిళనాడుకు చెందిన వ్యక్తికి సంబంధాలున్నాయని వ్యాఖ్యానించిన కేంద్ర మహిళా మంత్రి శోభపై ఎన్నికల కమిషన్‌కు డీఎంకే ఫిర్యాదు చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ కక్షతో కేంద్రమంత్రి తమిళనాడు వ్యక్తిని ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నట్లు మాట్లాడడం చట్టవిరుద్ధమని, అందువల్ల ఆమెపై చర్యలు తీసుకోవాలంటూ డీఎంకే తరఫున ఆర్ఎస్ భారతి నేతృత్వంలో ఈసీకి ఫిర్యాదు చేశారు.

ఒకేరోజు రూ.10.34 లక్షల నగదు స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు

వేలూరు, మార్చి 20: జిల్లాలో మంగళవారం ఒకేరోజు రూ.10.34 లక్షల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకు న్నారు. ఆంధ్ర సరిహద్దులో సులోచన దేవి నుంచి రూ.3.84 లక్షలు, బ్రహ్మపురంలో ఇళవరసన్ నుంచి రూ.65 వేలు, పళ్లికొండ వద్ద రూ.5.80 లక్షలు అని మొత్తం రూ.10,34,500 స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

బీజేపీకి ఈసీ నోటీసు

పెరంబూర్, మార్చి 20: నరేంద్ర మోదీ కోవైలో నిర్వహించిన రోడ్ షోలో విద్యార్థులను వినియోగించడంపై వివరణ ఇవ్వాలని బీజేపీకి ఎన్నికల కమిషన్ నోటీసు జారీ చేసింది. ఈ వ్యవహారంపై ఇప్పటికే పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వద్ద విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో, ఈ వ్యవహారంపై డీఎంకే, సీపీఐ తదితర పార్టీలు అందజేసిన ఫిర్యాదుపై వివరణ ఇవ్వాలని కార్యక్రమం నిర్వహించిన బీజేపీ నేతలకు సమన్లు జారీ చేసినట్లు ఈసీ తెలియజేసింది.

ఆలయ ఏనుగుకు రూ.25 లక్షలతో స్విమ్మింగ్ పూల్



స్విమ్మింగ్ పూల్‌లో ఆనందంగా జలకాలాడుతున్న అభియాంబిక

పెరంబూర్, మార్చి 20: మైలాడుదురై మాయూరనాధర్ ఆలయంలో సంరక్షిస్తున్న 56 ఏళ్ల ఏనుగు అభియాంబికైకు రూ.25 లక్షలతో నిర్మించిన స్విమ్మింగ్ పూల్, బసచేసే గదిని ఆలయ ప్రధాన అర్చకులు స్వామినాథ్ బుధవారం ప్రారంభించారు. ప్రత్యేక పూజల అనంతరం షవర్‌బాత్‌తో కూడిన స్విమ్మింగ్ పూల్‌లో అభియాంబిక ఆనందంగా జలకాలాడింది. ఏనుగు తొండంతో నీరు తీసుకొని శరీరంపై పోసుకోవడం, నీళ్లలో అటు ఇటు తిరిగే దృశ్యాలను భక్తులు ఆనందంగా వీక్షించారు.

ముగిసిన ఇంటర్ - ఇంటర్నేషనల్ బాస్కెట్ బాల్ టోర్నీ



విజేతలను అభినందిస్తున్న నిర్వాహకులు

అడయార్, మార్చి 20: హిందుస్థాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (హెచ్ఐటీఎస్) ఆధ్వర్యంలో 33వ డాక్టర్ కేసీజీ వర్గీస్ మెమోరియల్ ఇంటర్ - ఇంటర్నేషనల్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ తాజాగా జరిగింది. బే రేంజ్ క్యాంపస్‌లోని మైఖేల్ జోర్దాన్ బాస్కెట్ బాల్ కోర్టులో పురుషులు, మహిళల టోర్నీలో నగరంలోని టాప్-18 యూనివర్శిటీలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో పాల్గొన్న వారిని హెచ్ఐటీఎస్ చాన్సలర్ డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీస్ ప్రత్యేకంగా అభినందించారు. విజేత జట్లకు బహుమతి ప్రదానోత్సవ ంలో మహిళల బాస్కెట్ బాల్ టీం సీనియర్ హెడ్ కోచ్ ఎస్.భాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హెచ్ఐటీఎస్ పూర్వవిద్యార్థి, ఇంటర్నేషనల్ బాస్కెట్ బాల్ క్రీడాకారిణి టి.దర్శిణి, వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్ఎన్ శ్రీధర, స్పోర్ట్స్ అడ్వైజర్ అబ్రహం వర్గీస్ తదితరులు పాల్గొన్నారు. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన సత్యభామ యూనివర్శిటీ మహిళా జట్టుకు రూ.20 వేల నగదు బహుమతి, రన్నరప్‌గా నిలిచిన హిందుస్థాన్ యూనివర్శిటీ జట్టుకు రూ.15 వేలు, 3, 4 స్థానాల్లో నిలిచిన జేపియర్ యూనివర్శిటీ, ఎస్ఎస్ఎన్ యూనివర్శిటీకి రూ.10 వేలు, రూ.7 వేల చొప్పున ప్రదానం చేశారు.

బ్లూస్టార్ నుంచి కొత్తశ్రేణి డీప్ ఫ్రీజర్లు



సమావేశంలో మాట్లాడుతున్న త్యాగరాజన్, శ్రీనివాస రెడ్డి

అడయార్, మార్చి 20: బ్లూస్టార్ నుంచి అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో, సమర్థవంతమైన డీప్ ఫ్రిజర్లను విడుదల చేసినట్టు ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బి.త్యాగరాజన్, వైస్ ప్రెసిడెంట్ ఎం.శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. బుధవారం నగరంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఇవి 60 నుంచి 600 లీటర్ల శ్రేణిలో ఎకోఫ్రెండ్లీగా తయారు చేశామన్నారు. ఈ కొత్త శ్రేణి డీప్ ఫ్రీజర్లు అధిక నిల్వ, మెరుగైన శీతలీకరణ సామర్థ్యాన్ని అందిస్తాయని తెలిపారు. ఇవి గరిష్ఠంగా 47 డిగ్రీల ఉష్ణోగ్రతలో కూడా పనిచేసేలా తయారు చేసినట్టు తెలిపారు. లెడ్ లైట్ స్మార్ట్ ఐ, స్క్వేర్ డిజైన్‌తో విస్తృత శ్రేణి, కంట్రోలింగ్ ప్యానెల్, నాలుగు వైపుల శీతలీకరణను నియంత్రించే క్వాడ్రా కూల్ టెక్నాలజీ, 160వీ నుంచి 270 వీ వరకు విస్తృత ఆపరేటింగ్ వోల్టేజ్ పరిధి, ఇతర ఫీచర్లు కలిగివున్నట్టు తెలిపారు. ఈ ఫ్రీజర్లు డెయిరీలు, ఐస్‌క్రీం పార్లర్లు, రెస్టారెంట్లు, ఫుడ్, కన్వీనియన్స్ స్టోర్లు, హాస్పిటళ్లు, సూపర్ మార్కెట్లు వంటి వాటికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వీటి ప్రారంభ ధర రూ.16 వేలుగా నిర్ణయించామన్నారు. తమ కంపెనీకి 21 వేల సేల్స్ అండ్ సర్వీస్ చానెల్ పార్టనర్లు ఉన్నారని తెలిపారు. వినియోగదారుల సేవలో బ్లూస్టార్ ఏసీల తర్వాత కమర్షియల్ రిఫ్రిజిరేషన్ ఐఎస్‌వో సర్టిఫైడ్ సర్వీస్ ప్రొవైడర్ దేశంలోనే అగ్రగామిగా ఉందన్నారు.



ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాస్కులతో చెన్నైలో కార్యకర్తల ప్రచారం

ఆ ఏడు నియోజకవర్గాల్లో డీఎంకే... అన్నాడీఎంకే ఢీ



పెరంబూర్, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే - అన్నాడీఎంకే ఏడు స్థానాల్లో డీ అంటే ఢీగా పోటీ పడనున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులను డీఎంకే అధ్యక్షుడు బుధవారం విడుదల చేశారు. కూటమి పార్టీలకు కేటాయించిన సీట్లు పోను 21 స్థానాల్లో డీఎంకే పోటీ చేయనుంది. ఇక, ప్రతిపక్ష అన్నాడీఎంకే తరపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులు 16 మందితో కూడిన తొలి జాబితాను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఈపీఎస్ బుధవారం విడుదల చేశారు. ప్రకటించిన అభ్యర్థులను పరిశీలిస్తే 7 నియోజకవర్గాల్లో డీఎంకే - అన్నాడీఎంకే నేరుగా తలపడనున్నాయి. ఉత్తర చెన్నై, దక్షిణ చెన్నై, కాంచీపురం, అరక్కోణం, ఆరణి, సేలం, తేని నియోజకవర్గాల్లో డీఎంకే, అన్నాడీఎంకే చిహ్నాలైన ఉదయించే సూర్యుడు, రెండాకులతో నేరుగా తలపడనున్నాయి.

గాడిద విలువ మనిషికి ఏది?

రూ.1,000 ఇచ్చి తనకు ఓటేయాలని అడిగిన రాజకీయ నేతతో ఓ వృద్ధుడు ఇలా అన్నాడు..

వృద్ధుడు: అయ్యా! నాకు గాడిదను కొనిస్తే నీకే ఓటేస్తా.

రాజకీయ నేత: అమ్మో! గాడిద విలువ రూ.లక్ష. దానిని కొనివ్వలేను.

వృద్ధుడు: అంటే గాడిదకున్న విలువ కూడా నాకు లేదా?

రాజకీయ నేత: నోటు తీసుకుని ఓటేసేవాళ్లకి ఈ విషయం తెలిస్తే బావుండు.



● ఇరగదీసిన ఇండిపెండెంట్లు

రాష్ట్రంలో నామినేషన్ల స్వీకరణ బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. ప్రధాన పార్టీలన్నీ అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల మేనిఫెస్టో తయారీల్లో తలమునకలై ఉండటంతో ఆ పార్టీల అభ్యర్థులెవరూ నామినేషన్లు సమర్పించలేదు. అదే సమయంలో పలు చోట్ల స్వతంత్ర అభ్యర్థులు సందడిగా నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో ఎలక్షన్ కింగ్ పద్మరాజన్ ఉండడం విశేషం.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

తొలి రోజు స్వతంత్ర అభ్యర్థుల సందడి

గాంధీ వేషంలో రూ.10 నాణేలతో...

నామక్కల్‌లో ఓ ఇండిపెండెంట్ అభ్యర్థి గాంధీ వేషంలో డిపాజిట్ సొమ్ము రూ.25వేలను రూ.10 నాణేలుగా తట్టలో పెట్టుకుని రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం వరకూ పాదయాత్రగా వెళ్ళి నామినేషన్ దాఖలు చేశారు. నామక్కల్ సమీపంలోని చెల్లం పట్టికి చెందిన గాంధేయవాది రమేష్ ఇలా గాంధీ వేషంతో వెళ్లి రిటర్నింగ్ ఆఫీసర్ వద్ద నామినేషన్ సమర్పించారు. ముందుగా కార్యాలయ సిబ్బంది రమేష్ తీసుకొచ్చిన పది రూపాయల నాణేలను అరగంట సేపు లెక్కించారు.



నామక్కల్‌లో గాంధీ వేషంలో నాణేల తట్ట పట్టుకుని నామినేషన్ వేయడానికి వెళుతున్న ఇండిపెండెంట్ అభ్యర్థి రమేష్

శవపేటికతో...

పొల్లాచ్చి నియోజకవర్గంలో పోటీకి స్వతంత్ర అభ్యర్థి నూర్ మహమ్మద్ శవపేటికతో నామినేషన్ వేయడానికి వెళ్లడంతో కోయంబత్తూరులోని ఆ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. దేశంలో ప్రజాస్వామ్యం మృతి చెందిందంటూ పెద్దపెట్టున నినాదాలు చేశాడు. పోలీసులు అడ్డుకుని శవపేటికను కార్యాలయం వద్దకు తీసుకెళ్లేందుకు అనుమతించమన్నారు. దీంతో నూర్ మహమ్మద్ రోడ్డుపై బైఠాయించారు. ఆ తర్వాత శవపేటికను రోడ్డు పక్కగా ఉంచి, కార్యాలయానికి నడచుకుంటూ వెళ్లి ఎన్నికల అధికారి వద్ద నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నూర్ మహమ్మద్ విలేఖరులతో మాట్లాడుతూ... ఇప్పటివరకు తాను వివిధ ఎన్నికల్లో 42 సార్లు నామినేషన్ దాఖలు చేశానని చెప్పారు. ప్రస్తుతం దేశంలో ఎవరూ ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించడం లేదన్న బాధను వ్యక్తం చేసేందుకే ప్రజాస్వామ్యం మృతి చెందినట్లు నినాదాలిచ్చానని పేర్కొన్నారు.



కోయంబత్తూరులో ధర్నా చేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి నూర్ మహమ్మద్

ఉరితాడు చేతపట్టుకుని...

మదురై లోక్‌సభ నియోజకవర్గంలో సెల్లూరుకు చెందిన సంఘ సేవకుడు శంకరపాండ్యన్ చేత ఉరితాడు పట్టుకుని కాలినడకనే నడిచి వెళ్ళి నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల్లో అవినీతిపరులకు ఓటేస్తే అది ఆత్మహత్యతో సమానమని ప్రజల్లో అవగాహన కల్పించడానికే తాను ఉరితాడును చేత పట్టుకుని వెళ్లి నామినేషన్ వేశానని చెప్పారు.



ఉరితాడుతో నామినేషన్ వేయడానికి వెళుతున్న శంకరపాండ్యన్

వ్యాసర్పాడి ముల్లైనగర్ కూడలిలో రోడ్డుపై బైఠాయించి నిరసన



●అదును చూసి డిమాండ్...

ఇల్లిస్తేనే ఓటేస్తాం

వ్యాసర్పాడిలో ధర్నా

ప్యారీస్, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల్లో తమకు ఇళ్లిస్తేనే ఓటేస్తామని పెరంబూర్ శాసనసభ నియోజకవర్గ పరిధిలోని వ్యాసర్పాడి ఎంజీఆర్ నగరవాసులు తేల్చి చెప్పారు. ఎంజీఆర్ నగర్‌లో తమిళనాడు స్లమ్ క్లియరెన్స్ బోర్డు నిర్మించిన క్వార్టర్స్ శిథిలావస్థకు చేరడంతో మూడేళ్ల క్రితం కూల్చివేసి కొత్త ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఈ క్వార్టర్స్‌లో నివసించిన కుటుంబాలకు వేరే ప్రాంతంలో ఆశ్రయం కల్పించకపోగా, మూడేళ్లుగా క్వార్టర్స్ నిర్మాణపనులు నత్తనడకగా సాగుతున్నాయని, దీనిపై ఎమ్మెల్యే ఆర్డీ శేఖర్, టీఎన్ఎస్ఈబీ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం కనిపించలేదన్నారు. ఇదే డిమాండ్‌పై గత నెల 8వ తేది కూడా రాస్తారోకో నిర్వహించిన బాధితులకు వారం, రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని సంబంధించిన అధికారులు హామీ ఇచ్చారు. అయితే, ఈ నేపథ్యంలో, అధికారుల హామీ నెరవేర్చలేదంటూ బుధవారం ఉదయం ముల్లైనగర్ నాలుగు రోడ్ల కూడలిలో ఉన్నట్టుండి ధర్నాకు దిగారు. దీంతో, రెడ్‌హిల్స్, కన్నదాసన్ నగర్ ప్రాంతాల నుంచి వ్యాసర్పాడి మీదుగా ప్యారీస్, తిరువొత్తియూర్ తదితర ప్రాంతాలకు బయల్దేరిన ప్రభుత్వ బస్సులు, ప్రైవేటు వాహనాలు, ఆటోలు సుమారు గంటకు పైగా కదల్లేని పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అధికారులతో ఇళ్లిచ్చే దాకా తాము ఓటు వేయమని, మాకు ఎన్నికల సమయంలోనైనా న్యాయం చేయాలని వాగ్వాదానికి దిగారు. సుమారు రెండు గంటల చర్చల అనంతరం ఆందోళన సద్దుమణగడంతో వాహనాల రాకపోకలు సాగాయి.

● నియోజకవర్గం గురించి తెలుసుకోండి!

కృష్ణగిరిలో ఏ పార్టీ గెలిచేనో?



ప్యారీస్, మార్చి 20: దేశంలోనే పూల ఎగుమతిలో అగ్రస్థానంలో ఉన్న కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గంపై ఎవరిది పైచేయి అవుతుందోనన్న చర్చ అప్పుడే మొదలైంది. ఈ నియోజకవర్గంలో ఊత్తాంగరై (రిజర్వుడు), బర్గూర్, కృష్ణగిరి, వేపనహళ్లి, హోసూరు, తళి అనే ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇప్పటివరకు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 8 సార్లు, డీఎంకే ఐదుసార్లు, అన్నాడీఎంకే మూడుసార్లు, టీఎంసీ ఒక సారి గెలుపొందాయి. కర్ణాటక సరిహద్దును పంచుకునే ఈ జిల్లాపై ఆది నుంచి అన్ని వర్గాలకు ఎనలేని ఆసక్తి.

మొత్తం ఓటర్లు: 16,09,913
పురుషులు: 8,07,389
మహిళలు: 8,02,219
ఇతరులు: 305



2014 ఎన్నికల్లో...

2014 లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే అభ్యర్థి అశోక్‌కుమార్ 4,80,491, డీఎంకే అభ్యర్థి చిన్నపిల్లప్ప 2,73,900, పీఎంకే అభ్యర్థి జీకే మణి 2,24,963 ఓట్లు పొందారు.

2019లో...

2019 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్, అన్నాడీఎంకే, నామ్ తమిళర్ కట్చి సహా ఇండిపెండెంట్ పోటీ చేశారు. వీరిలో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చెల్లకుమార్ 6,11,298 ఓట్లు రాబట్టుకొని ఎంపీగా గెలిపించారు. అన్నాడీఎంకే ప్రిసీడియం చైర్మన్ కేపీ మునుస్వామి 4,54,533 ఓట్లు, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థి మధుసూదన్‌కు 28,000 ఓట్లు వచ్చాయి.

ప్రధాన సమస్యలు...

కృష్ణగిరి జిల్లా ప్రజలు 82 ఏళ్లుగా రైల్వేస్టేషన్ కోరుతున్నారు. హోసూరు - కృష్ణగిరి - జోలార్‌పేట రైలు మార్గం తదితర రైల్వే పథకాల కోసం అలుపెరగక పోరాడుతూనే ఉన్నారు. మామిడి పండ్ల జ్యూస్ కర్మాగారం, పంటలకు గిట్టుబాటు ధర, సాగునీటి కొరత తీర్చాలన్న డిమాండ్లతో రైతులు సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ, వారికి న్యాయం జరగలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రం బన్నారగట్టలోని అడవుల నుంచి ఆహారం కోసం వస్తున్న ఏనుగుల గుంపు హోసూరు, పరిసర ప్రాంతాల్లోని నివాస ప్రాంతాల్లోకి చొరబడడం, చేతి కందాల్సిన పంటలను ధ్వంసం చేయడం, కొన్ని సందర్భాల్లో వాటి వల్ల ప్రాణనష్టం కూడా జరుగుతోందని వాపోతున్న స్థానికులు, 140 కి.మీ దూరానికి అటవీ ప్రాంతంలో సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కృష్ణగిరిలో ఉన్న టోల్‌గేట్‌ను తొలగించాల్సిందేనని స్థానికుల పట్టుబడుతున్నారు. కేంద్రప్రభుత్వ 'జల్ జీవన్' పథకం కింద హోసూరు, చుట్టుపక్కల ప్రాంతాలకు విస్తరింపజేయని కారణంగా ఈ వేసవిలో తాగునీటికి తీవ్ర కొరత ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. అంతర్జాతీయ పూల ఎగుమతి కేంద్రం ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని ఒక్క పార్టీ కూడా నిలబెట్టుకోలేదు. అందువల్ల విదేశీ పూల వ్యాపారులు పూల కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదని, ఆన్‌లైన్‌లో పూలకు ఆర్డర్ తీసుకొనే వసతి కూడా కల్పించలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రానైట్ మండలంగా ప్రకటించాలని, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఆదుకోవాలని, సుగంధ ద్రవ్యాల ఫ్యాక్టరీ నిర్మించాలని, చింతపండు భద్రపరచుకొనేందుకు ఏసీ గిడ్డంగి నిర్మించాలి తదితర డిమాండ్లు కూడా ఇప్పటివరకు నెరవేరలేదని స్థానిక ఓటర్లు ఆరోపిస్తున్నారు.

నా బాధ్యతలు విస్మరించలేదు

● ఎంపీ డాక్టర్ చెల్లకుమార్

కృష్ణగిరి రైల్వే పథకాల గురించి పలువురు విమర్శిస్తున్నది వాస్తవమే. నేను రైల్వే అధికారులతో కలసి పలు ప్రాంతాలను పరిశీలించి ప్రణాళిక కూడా తయారు చేయించాను. అయితే కరోనా వల్ల కేంద్ర నిధులు ఆగిపోయాయి. అంతేకాకుండా రైల్వే శాఖ భవన నిర్మాణ కార్యాలయం కూడా మూతపడింది. ముఖ్యంగా కరోనా సీజన్‌లో కేంద్రప్రభుత్వం ఎంపీ నిధులు కూడా కేటాయించలేదు. అందిన రూ.17 కోట్లతో స్వచ్ఛంద సంస్థలతో కలసి కృష్ణగిరి నియోజకవర్గంలో పలు పనులు నెరవేర్చాను. నా గురించి వస్తున్న విమర్శలు పట్టించుకోను. అయినా పార్టీ అధిష్ఠానం అవకాశం ఇస్తే మళ్లీ ఇక్కడి నుంచే పోటీ చేస్తా.

ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకునే నగదు

● 3 నెలల తర్వాతే తిరిగి చెల్లింపు



చెన్నై, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకునే నగదు,బంగారు నగలు, ఇతర విలువైన వస్తువులను మూడు నెలల తర్వాతే తిరిగి ఇస్తారని ఎన్నికల సంఘం అధికారులు పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పరిమితికి (రూ.50వేలకు) మించి నగదును తీసుకెళితే ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకుంటారని, ఆ నగదుకు సంబంధించిన రశీదులు ఆధార పత్రాలు ఉంటే అవి నిజమైనవేనని అప్పటికప్పుడు నగదును తిరిగి ఇచ్చేస్తారని తెలిపారు. అయితే రశీదులు, ఆధార పత్రాలు లేకుండా లక్షలాది రూపాయలను తీసుకెళ్ళి పట్టుబడితే ఆ నగదు అధికంగా ఉంటే ఆదాయపు పన్నుల శాఖ అధికారులకు అప్పగిస్తారని తెలిపారు. ఐదు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు జరుపుతున్న తనిఖీల్లో రూ.3 కోట్లకు పైగా నగదు పట్టుబడిందని తెలిపారు. రూ. 30లక్షలకు పైగా పట్టుబడితే విచారణ జరుగుతుందని, ఆ విచారణలో ఐటీ అధికారులు కూడా పాల్గొంటారని వివరించారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో రూ.951 కోట్ల నగదు, నగలు, విలువైన వస్తువులు పట్టుబడ్డాయని తెలిపారు.

● హెచ్చరిక

ఎన్నికల పనులు బహిష్కరిస్తే చర్యలు

● టీచర్లకు విద్యాశాఖ వార్నింగ్

ఐసిఎఫ్, మార్చి 20: కుంటిసాకులు చెప్పి ఎన్నికల పనులు బహిష్కరిస్తే చర్యలు తప్పవని ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు హెచ్చరించారు. రాష్ట్రంలో ఏప్రిల్ 19వ తేది లోక్‌సభ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. పోలింగ్ బూత్‌లలో ఉద్యోగులుగా పనిచేసేందుకు ఉపాధ్యాయులను ఎంపిక చేసి, వారి జాబితా తయారు చేస్తున్నారు. వీరికి ఎన్నికల కమిషన్ మూడు విడతలుగా శిక్షణ ఇవ్వనుంది. ఈ నేపథ్యంలో, ఒక్కో జిల్లాలో కొందరు ఉపాధ్యాయులు మెడికల్ సర్టిఫికేట్ ఆధారంగా తమకు ఎన్నికల పనుల నుంచి మినహాయించాలని జిల్లా విద్యాధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. దీనిపై జరిపిన విచారణలో పలువురు ఉపాధ్యాయులు చెబుతున్న అనారోగ్యం కేవలం ఎన్నికల పనుల నుంచి తప్పించుకొనేందుకు మాత్రమేనని తెలిసింది. దీనిపై స్పందించిన అధికారులు, కుంటిసాకులు చెప్పి ఎన్నికల పనులు బహిష్కరించే ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

● అభ్యర్థులొచ్చేశారు బాస్...

డీఎంకే అభ్యర్థుల జాబితా వెల్లడి

● 11 మంది కొత్త ముఖాలు ● ముగ్గురు మహిళలకు అవకాశం ● తూత్తుకుడి నుంచి కనిమొళి ● దక్షిణ చెన్నై నుంచి తమిళచ్చి తంగపాండ్యన్ ● తెన్‌కాశి నుంచి రాణి

చెన్నై, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ తరపున పోటీ చేయనున్న అభ్యర్థుల జాబితాను డీఎంకే బుధవారం ఉదయం వెలువరించింది. వీరిలో 11 మంది కొత్త ముఖాలుండడం విశేషం. అంతేగాక 21 మందిలో ముగ్గురు మహిళలు, 19 మంది పట్టభద్రులున్నారు. రాజధాని నగరం చెన్నైలోని మూడు నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎంపీలే పోటీ చేస్తున్నారు. అరక్కోణంలో జగద్రక్షగన్, తూత్తుకుడిలో కనిమొళి, శ్రీపెరుంబుదూరులో టీఆర్ బాలు మళ్లీ పోటీకి దిగుతున్నారు. తేనిలో తంగ తమిళ్‌సెల్వన్ పోటీ చేయనున్నారు. ఈసారి సిట్టింగ్ ఎంపీలు ఐదుగురికి పార్టీ టిక్కెట్లు లభించలేదు. కళ్లకురిచ్చిలో మాజీమంత్రి పొన్ముడి కుమారుడు గౌతమ్ శిఖామణి మరోమారు పోటీ చేయడానికి అవకాశం ఇవ్వలేదు. ధర్మపురిలో సెంథిల్, తంజావూరులో ఎస్ఎస్ పళనిమాణిక్యంకు ఈసారి టిక్కెట్లు లభించలేదు. తంజావూరులో ఎస్ఎస్ పళనిమాణిక్యం ఐదుసార్లు గెలిచారు. అయితే జిల్లా శాఖ నేతల అభిప్రాయాల మేరకు కొత్త అభ్యర్థిగా మురసొలిని ఎంపిక చేశారు. ఇదే విధంగా ధర్మపురి ఎంపీ సెంథిల్ పార్లమెంట్‌లో ప్రజాసమస్యలు గురించి ప్రస్తావించి మంచి పేరు తెచ్చుకున్నప్పటికీ నియోజవర్గంలో పార్టీ అభివృద్ధిని పట్టించుకోలేదనే ఆరోపణలు వచ్చాయి. గత శాసనసభ ఎన్నికల్లో ధర్మపురి జిల్లాలో డీఎంకే అభ్యర్థులంతా ఓటమి పాలయ్యారు. దీనికి కారణం సెంథిల్ సక్రమంగా పని చేయక పోవడమేనని అధిష్ఠానం భావించి ఆయనకు సీటివ్వలేదు. దీంతో కొత్త అభ్యర్థిగా ఎ.మణిని ఎంపిక చేసింది. ఇదే విధంగా సేలంలో ఎస్ఆర్ పార్తిబన్, తెన్‌కాశిలో ధనుష్ ఎం కుమార్‌కు మళ్లీ పోటీ చేసే అవకాశం లభించలేదు.

డీఎంకే స్థానాలు... అభ్యర్థుల వివరాలివే

నార్త్ చెన్నై- కళానిధి వీరాసామి, సౌత్ చెన్నై - తమిళచ్చి తంగపాండ్యన్, సెంట్రల్ చెన్నై - దయానిధి మారన్, శ్రీపెరుంబుదూరు - టీఆర్ బాలు, కాంచీపురం - కె.సెల్వం, అరక్కోణం - జగద్రక్షగన్, వేలూరు- కదిర్ ఆనంద్, తూత్తుకుడి - కనిమొళి, తేని - తంగ తమిళ్‌సెల్వన్, నీలగిరి - ఎ.రాజా, కళ్లకురిచ్చి - మలైయరసన్, పెరంబలూరు- అరుణ్ నెహ్రూ, సేలం - సెల్వగణపతి, తంజావూరు - మురసొలి, తెన్‌కాశి - రాణి, పొల్లాచ్చి - కె.ఈశ్వరసామి, కోయంబత్తూరు - గణపతి పి.రాజ్‌కుమార్, ఈరోడ్ - కేఈ ప్రకాష్, ఆరణి - ధరణి వేందన్, తిరువణ్ణామలై - సీఎన్ అన్నాదురై, ధర్మపురి - ఎ.మణి.



కనిమొళి



తమిళచ్చి తంగపాండ్యన్



రాణి

చిత్రజ్యోతి

'మరియన్' ఓ ఫిక్షన్... ఆడు జీవితం' రియల్ లైఫ్

● ఏ. ఆర్.రెహ్మాన్



విలేకరుల సమావేశంలో ఏఆర్.రెహ్మాన్, జిమ్మీ పృథ్విరాజ్, బ్లెస్సీ తదితరులు

పృథ్వీరాజ్ సుకుమారన్ - అమలాపాల్ జంటగా మలయాళ దర్శకుడు బ్లెస్సీ తెరకెక్కించిన 'ఆడు జీవితం' రియల్ లైఫ్ స్టోరీ, దీనికి 'మరియన్' చిత్రానికి ఏమాత్రం పోలిక లేదని ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహ్మాన్ అన్నారు. రెండు మాటల్లో చెప్పాలంటే 'మరియన్' ఓ ఫిక్షన్, 'ఆడు జీవితం' రియల్ స్టోరీ అని స్పష్టం చేశారు. ఈ నెల 28న విడుదలకానున్న ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం. మలయాళం సాహిత్యంలో గుర్తింపు తెచ్చుకుని, ప్రతుల విక్రయాల్లో రికార్డు నెలకొల్పిన 'ఆడు జీవితం' (ది గోట్ లైఫ్) పుస్తకం ఆధారంగా ఈ చిత్రాన్ని తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో తెరకెక్కించారు. ఈ సినిమా విడుదలను పురస్కరించుకుని చిత్ర బృందం మంగళవారం చెన్నైలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో రెహ్మాన్ మాట్లాడుతూ... 'ఆడు జీవితం' పుస్తకం కొన్ని లక్షల కాపీలు అమ్ముడుపోయాయి అంటే అందులో ఏదో ఉందని అర్థం. అది ఏమిటో సినిమా చూసి మీరే చెప్పండి' అన్నారు. దర్శకుడు బ్లెస్సీ మాట్లాడుతూ... 'ఈ సినిమా గురించి నేను మాట్లాడటం కంటే నిరూపించాలని భావిస్తున్నా. గత 20-25 యేళ్లలో రెహ్మాన్ వంటి మనిషిని చూడలేదు. ఈ ప్రాజెక్టు ప్రారంభించే సమయంలో నా వద్ద డబ్బులు, బడా నిర్మాణ సంస్థలు లేవు. నజీబ్ అనే పాత్ర మాత్రమే ఉంది. దాన్ని అర్థం చేసుకున్న రెహ్మాన్ 2017నుంచి మాతో ప్రయాణిస్తున్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్‌కు ఈపాత్ర చెప్పి 16 యేళ్లు గడిచిపోయాయి. ఆయన వివాహం, పిల్లలు, నిర్మాత ఇలా అనేక మార్పులు జరిగాయి. ప్రారంభం నుంచి ముగింపు వరకు అదే అకుంఠిత దీక్షతో పని చేశారు' అని అన్నారు. హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ... 'ఈ సినిమా ప్రయాణం నా జీవితంలో ఒక భాగం. 2008లో నజీబ్‌గా నువ్వు నటించాలని డైరెక్టర్ బ్లెస్సీ చెప్పారు. అప్పటి నుంచి ఆయన ఈ ప్రాజెక్టు కోసమే పనిచేశారు. ఇది అసాధారణమైన విషయం. షూటింగులో ఎన్నో అవాంతరాలు వచ్చాయి. అసలు సినిమా పూర్తవుతుందా అన్న సందేహం. జోర్డాన్, అల్జీరియా, సహారా ఎడారిలో తెరకెక్కించాం. మూడు నాలుగేళ్లపాటు ఎడారిలో చిక్కుకున్న ఒక వ్యక్తి జీవిత చరిత్రే ఈ సినిమా స్టోరీ. 2022 నుంచి పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు చేపట్టాం. నజీబ్ అనే వ్యక్తి పోరాటం, అతనిలోని ఆత్మవిశ్వాసం, పట్టుదల, అతనిలా ఉండే అనేక మందికి ఈ సినిమాను సమర్పిస్తున్నాం' అని పేర్కొన్నారు.



'కంగువా'లో సూర్య

ఈ యేడాది విడుదలకానున్న సూర్య రెండు చిత్రాలు!

ఈయేడాది హీరో సూర్య నటించే రెండు చిత్రాలు ప్రేక్షకుల ముందుకురానున్నాయి. వీటిలో ఒకటి కంగువా. చిరుత్తై శివ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతం చివరి దశ నిర్మాణ పనులను శరవేగంగా జరుపుకుంటోంది. ఈమూవీని జూన్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆ తర్వాత సుధా కొంగర దర్శకత్వంలో సూర్య నటించే 43వ చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమాకు 'పురనానూరు' అనే టైటిల్‌ను ఖరారు చేయగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించనున్నారు. సూర్య - సుధ కొంగర కాంబినేషన్‌లో వచ్చిన 'సూరరైపోట్రు' ఘనవిజయం సాధించిన విషయం తెల్సిందే. అయితే, ఈ ప్రాజెక్టు మాత్రం కాస్త ఆలస్యంకానుందని హీరో సూర్య అధికారికంగా వెల్లడించారు. అయినప్పటికీ ఈ యేడాది ఆఖరునాటికి ఈ సినిమా థియేటర్లలోకి వస్తుందని కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ నిర్మాణ పనులు జరుపుకుంటోంది. అలాగే, హిందీలో కూడా సూర్య నటించే 'కర్ణ' ప్రాజెక్టును కూడా పూర్తి చేయాలన్న ఆలోచనలో సూర్య ఉన్నారు. అలాగే, 'కంగువా' మూవీ టీజర్‌ను మంగళవారం రిలీజ్ చేశారు.

లోకేష్ కనకరాజ్ - శ్రుతిహాసన్ ఇండిపెండెంట్ ఆల్బం

విశ్వనటుడు కమల్ సొంత నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ 'ఇనిమేల్' పేరుతో ఇండిపెండెంట్ ఆల్బంను రూపొందించింది. సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్, హీరోయిన్ శ్రుతిహాసన్ కలిసి చేసిన ఈ ఆల్బంను ఆధునిక పట్టణ ప్రేమలోని వివిధ దశలను తెలియజేసేలా రూపొందించారు. ఈ సాంగ్‌ను శ్రుతిహాసన్ నేపథ్యగానం చేయడమే కాకుండా సంగీతం కూడా సమకూర్చారు. సాహిత్యాన్ని కమల్ అందించారు. 'విక్రమ్' సినిమా తర్వాత రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్‌తో కలిసి లోకేష్ కనకరాజ్ పనిచేసిన ప్రాజెక్టు ఇదేకావడం గమనార్హం. కాగా, శ్రుతిహాసన్ ఇప్పటికే 'ఎడ్జ్', 'షీ ఇన్ఏ హీరో', 'మాన్‌స్టర్ మెషిన్' వంటి ఇండిపెండెంట్ ఆల్బమ్స్‌ను రూపొందించి రిలీజ్ చేసిన విషయం తెల్సిందే.



కమల్‌తో లోకేష్ కనకరాజ్, శ్రుతిహాసన్